నిపుణుల సలహాలు:

ఆంధ్రా హోటల్స్

(అన్‌లిమిటెడ్)

ప్రథాష్ట్ర హోటల్ యజమానుల సభ మహా వైభవంగా జరుగుతున్నది. ప్రతినిధులకు, పత్రికా విలేఖరులకు చక్కటి సౌకర్యాలు చేయబడ్డవి. హోటల్ యజమానులకు రేషన్ అధికారులు, శానిటరీ అధికారులు కలిగిస్తున్న ఇబ్బందుల్ని నిరసిస్తూ, ఏకధాటిగా రెండు గంటలనుంచీ గంభీరోపన్యాసం చేస్తున్నాడు ఒకాయన. అనుగనుక్క చప్పట్ల కోలాహలం చెప్పటానికి వీల్లేకుండా ఉన్నది.

ఇంతకుముందు దిల్‌కుష్‌భవన్ (ఆంధ్రా హోటేల్స్) ఖ్యాతిని గురించి విన్నానే కాని, దాని యజమానిధాటిని చూట్టం ఇప్పటిదాకా పడలేదు.

సభ ముగిసినతరవాత ప్రతినిధుల బస దగ్గర ఆయన్ను కలుసుకుని 'విశ్వరూపం' పత్రికతరఫున తనతో మాట్లాడగోరుతున్నానని తెలియచేశాను.

"ఓ, అంతకన్నా కావలసిం దేమిటి? ఈరోజుల్లో మాకు ముఖ్యంగా కావాల్సినది ప్రచారమే" అని అన్నాడాయన.

* * * *

"అయితే ఇంతకే మీ వాదం ప్రభుత్వం మీకు తగిన ప్రోత్సాహం ఇవ్వటం లేదనేనా?" అని ప్రశ్నించాను.

"అవునండీ. ప్రభుత్వం బొత్తిగా దూరదృష్టి లేకుండా వ్యవహరిస్తున్నది. నూనె మిల్లులు స్థాపించటానికి డబ్బుసహాయం చేస్తున్నది, వనస్పతి ఫ్యాక్టరీలకు పర్మిట్ ఇస్తున్నది. కాని వాటిలో తయారయే సరుకును వాడవలసినవాళ్ళం మమ్మల్ని నిరుత్సాహపరిస్తే ఎట్లా?" అన్నాడాయన.

"అయితే మీరూ వాడేది ఆ సరుకే నంటారా, ఏమిటి?"

"మరి యేమిటనుకుంటున్నారు?"

"ఆఁ! ఏదో గ్రౌండ్‌నట్ ఆయిల్ వాడతారని అంతా అంటారులేండి."

ఆయనకు కొంచం కోపంవచ్చింది. ఏదో అనబోయి, యింతలో చటుక్కున ఏ సంగతో జ్ఞాపకంవచ్చి పెద్దగా నవ్వాడు.

"అట్లా వాళ్లు అంటానికి అవకాశం ఉందిలేండి. మాలో కొంతమంది వాడే వంటనూనెను చూస్తే అట్లాగే అనిపిస్తుంది" అన్నాడు.

"ఏమండీ! కాఫీహోటల్ లాభంగా ఉంటుందా, లేక భోజన హోటల్ లాభంగా ఉంటుందా? అని ప్రశ్నించాను.

"మొదట్లో భోజనహోటలే లాభంగా ఉండేది. కాని రేషన్ పెట్టినప్పటినుంచీ కాఫీహోటల్ కూడా దానితో సమానమయిపోయింది."

"అదేమిటండీ అట్లా అంటారు? రేషన్ వల్ల పెట్టే అన్నం తగ్గిపోతుందికదా? అందుకని భోజన హోటళ్ల లాభాలు పెరగవూ?"

"కాస్తో, కూస్తో పెరుగుతయ్ కాని కాఫీ హోటళ్ళకి తగిలేటంత గిరాకీమాత్రం ఉండదు. పప్పులో వార నేతిలో తీయాలంటారే, అట్లాగే అన్నంలో వారను కూరల్లో లాగాలని జనం చూస్తారు."

"మీరు మాత్రం తక్కువవాళ్లా యేమిటి? అసలు వడ్డించటంలోనే చూపిస్తారు మీ నైపుణ్యం అంతా. గరిటె విస్తరికి వేసి కొట్టటం తప్పితే, దిగసుపడటం ఏమయినా ఉంటుంది కనకనా?"

"అంతమాత్రంతో జనం వొదుల్తారంటండీ? ఇదివరకు రోజుల్లో అయితే కొసిరి కొసిరి వేయించుకునేవాళ్ళను చూసి అంతా నవ్వేవాళ్లు. కనుక వడ్డనవాళ్ళకి చులకనగా ఉండేది. ఇప్పుడే ముంది, బంతికి బంతీ వచ్చిన పదార్థాన్నల్లా వదలకుండా వేయించుకోటమే కదా! మొదటిబంతి వాళ్ళే చేసిన సరుకుని గుటకాయస్వాహా చేస్తున్నారు."

"మరికడుపు నిండకపోతే ఏంచేస్తారు?"

"దానికి మేము మాత్రం యేం చేస్తాం? కడుపు నిండకపోతే, రేషన్ పెంచమని ప్రభుత్వంవాళ్లను అడగమనండి. రేషను పెరిగితే మహారాజులకల్లే చేసిపెడతాం. లేకపోతే మేముమాత్రం యెక్కడనుంచి పుట్టించుకురాగలం చెప్పండి."

"అపాటి విద్య మీకు రాకపోతేకదా?"

"ఎన్నివిద్యలు తెలిస్తేమటుకు, ప్రభుత్వం ఊ అనందే మేము ఏం చేయగలం? జనంబాధ చూడలేకనే, మేమంతా భోజనహోటల్ పక్కనే కాఫీహోటళ్లను తెరుస్తున్నాం."

"ఆఁహాఁ! అందుకనా, ఇప్పుడు ఎక్కడ చూసినా హోటళ్ళే కనిపిస్తున్నవి?"

"ఔనండీ. తిండి చాలకపోతే మళ్ళీ టిక్కెట్టుకొని భోజనం చేసేవాడెవడు, కాఫీతాగేవాడు తప్పితే. అప్పటికీ ఎవరయినా కక్కుర్తిపడితే మేము చూసీ చూడనట్లు ఊరుకుంటున్నాం."

"అయితే డబ్బున్నవాడికి రేషన్‌బాధే లేదంటారు."

"ఏమీ లేదు. వాళ్లకి కావాలంటే బ్లాక్‌మార్కెట్ సరుకు దొరుకుతుంది. ఆ తిప్పలుపట్టం ఇష్టంలేకపోతే పేమున్నాము."

"మీరు ఈ వ్యాపారంలోకి దిగి ఎన్నాళ్ళవుతుంది?"

"ముప్ఫయ్యేళ్లు దాటింది."

"అబ్బో! అయితే మీ అనుభవాలు అద్భుతంగా ఉండిఉంటయ్."

"ఏదో ఉంటయ్ కానీయండి, అయితే నేను పడ్డ ఇబ్బందులుమాత్రం అంతా పడవలసి ఉండదు."

"అంటే?"

"వ్యాపారాన్ని మొదలుపెట్టి ఒక పద్ధతిలోకి తీసుకునిరావటం మాటలా? మొదట్లో కనుక మేము ఎన్నో ఇబ్బందులు పడ్డాము. ఇప్పుడు బండి ఒకదారిన పడ్డది కనుక, కొత్తగా వచ్చేవాళ్ళకు ఆ కష్టే ఇబ్బందులు ఉండవు."

"శ్రమ అనుకోకుండా ఉంటే, దాన్ని మీ రెట్లా సాధించారో దయచేసి చెప్తారా?"

"అందులో శ్రమ యేమున్నది? నేను మొట్టమొదట పకోడీలూ, మసాలా గారెలూ మొదలైనవాటిని నెత్తిన పెట్టుకుని ఇల్లిల్లూ తిరిగి అమ్ముకునేవాడిని. స్కూలుదగ్గర, కోర్టుదగ్గర, తాలూకా ఆఫీసుదగ్గర, దేవాలయందగ్గర మాలో కొంతమంది స్థిరంగా మకాం పెట్టుకునేవాళ్లు. తీర్థస్థలాల్లో బిచ్చగాళ్లు తమ స్థలాలను రిజర్వు చేసుకున్నట్లుగా నే, వాళ్లుకూడా ఆ స్థలాలను వదిలేవాళ్లు కాదు. అందుకని మేము మా సంచారాన్ని టైమునిపట్టి ఏర్పాటుచేసుకునేవాళ్ళం"

"టైమునిపట్టి అంటే?"

"స్కూలు ఆటవిడుపుటైముకీ, మానే వేళకూ అక్కడికి జేరేవాళ్ళం ఇట్లాగే కోర్టులు, తాలూకాఫీసులవెంట సమయానుకూలంగా తిరిగేవాళ్ళం. ఆ రోజుల్లో హాకర్ లైసెన్సులూ, శానిటరీవాళ్ళ గొడవలూ, పోలీసుల జులుం ఇంత చేటుగా ఉండేవి కాదు."

"ఓహో."

"తరవాత కాఫీహోటల్ పెడదామని పించింది. కాఫీహోటల్ అంటే, కనీసం ఒక రేకుల షెడ్డుకింద, విరిగిపోయినవో, ఊగులాడేవో నాలుగు బల్లల్నీ, బెంచీలనీ పడెయ్యక తప్పదుకదా! దానికి డబ్బు కావాలి అంతే కాకుండా భారీఎత్తులో పాలసప్లయికూడా అవసరమయి ఉంటుంది. ఇవన్నీ నాబోటివాడికి ఎట్లా కూడుతయ్యా అనేది పెద్ద చిక్కు అయిపోయింది ఆలోచించగా, ఆలోచించగా, ఫస్ట్ క్లాసయిన ఒకటి తట్టింది"

"అవును మరి. ఉపాయం లేనివాళ్ళను ఊళ్లోనించి తరిమెయ్యమన్నారు."

"హ హ్హ హ్హ! భేషుగ్గా చెప్పారు. ఏమిటయ్యా ఆ ఉపాయం అంటే, పాలవాళ్లనే పెట్టుబడి పెట్టమని అడగటం ఊళ్లో పాలు, పెరుగు సప్లయి చేసే నలుగురు మోతుబరి ఆసాములదగ్గిరికి వెళ్లి, నా ప్లానంతా చెప్పాను. షెడ్డువేసి, బల్లలు, బెంచీలు పడెయ్యటానికీ, పాత్రసామగ్రి కొనటానికీ, కొన్నాళ్లపాటు బండి సాగటానికీ, కావలసిన పెట్టుబడిని వాళ్లు పెట్టాలి. రోజూ హోటలికి కావలసినపాలను సప్లయి చేయాలి. నేను వ్యాపారం నడిపి, వాయిదాల్లో వాళ్ళసొమ్ము చెల్లిస్తానని చెప్పాను."

"దీన్లో వాళ్లకి పెద్ద లాభమేముంది? వ్యాపారంలో వాటా అడగలా?"

"ఊహుఁ! అడగలేదు అడిగినా నేను ఒప్పుకోదలచలేదు. అయినా, వాళ్లకి లాభం లేకపోవటమేమిటి? వాళ్లదగ్గర కాస్తోకూస్తో డబ్బుఉండేది. అది ఎట్లా పెట్టుబడి పెట్టాలో వాళ్లకు తెలిసేదికాదు అదీకాక హోటలికి పాలు సప్లయి చేయటంవల్ల వాళ్లకు ఎంతో శ్రమ తగ్గిపోయి, భారీఖాతా ఏర్పడేది. పాలు మిగిలిపోతయ్యేమోనన్న భయం ఉండేది కాదు"

"అవును మీ ప్లాను సబబుగానే ఉంది"

"ఉంది కాబట్టే ఇప్పుడు అంతా దాన్నే ఉపయోగిస్తున్నారు తెలుగు దేశంలో ఏ పక్కకయినా వెళ్లండి చిన్నరకం హోటళ్లన్నీ నాప్లాను ప్రకారమే నడుస్తున్నయ్" అని ఆయన గర్వంగా చూశాడు.

ఆయన్ని ఉబ్బెయ్యటానికి నేనుకూడ ఆశ్చర్యాన్ని నటించి "తరవాత?" అని ప్రశ్నించాను.

"తరవాతి కథలో ఆట్టే విశేషమేమీ లేదు షెడ్డుహోటల్లో కాస్త డబ్బు చేరిన తరవాత, పెద్దఎత్తులో నడిపించటం మాత్రమే జరిగింది డబ్బు కొంత ఉంటే, మన తెలివితేటలు ఆట్టే అవసరంలేకుండానే పిల్లల్ని పెడుతుంది"

"మీరు దక్షిణాదిఅన్నయ్యలతో పోటీ రాలా?"

"రాకేం? వాళ్ల దెబ్బకు నే నొకసారి దివాలా తీసేవరకు వచ్చింది. కానీ—వాళ్ల తస్సాదియ్యా! హోటల్ వ్యాపారంలో వాళ్లు అందవేసిన చేతులండీ"

"అయితే మరి ఇప్పుడు ఉడిపివాళ్ల జండా ఎగురుతున్నదేం?"

"వాళ్లూ, గుజరాతీలూ మానేజిమెంటులో ఆరితేరిన చేతులు. కాని స్వయంగా బండిని నడిపించలేరు దక్షిణాదివాళ్లదగ్గర స్వతంత్రించి నడిపే తాహతు కన్నా, ఒకళ్ల కింద పనిచేసే శక్తి ఎక్కువగా ఉన్నది అందువల్ల ఉడిపివాళ్లూ, గుజరాతీలూ మానేజ్ చేస్తుండగా, అరవసోదరులు హోటళ్లను నడుపుతున్నారు"

"మరి మన తెలుగువాళ్ళో?"

"బోంచేస్తున్నారు. వీళ్లకి కర్రపెత్తనం చేసే నెళుకువా, చాకిరిచేసే ఓపికా, రెండూ లేవు."

"అంతే సంబారా?"

"కాదండీ మనవాడు సర్వరుగా చేర్తాడనుకోండి. మహాతాత్సారంగా సర్వు చేస్తాడు కొంచెం తొందరగా తేవయ్యా బాబూ, అంటే నాలుగు ఝాడించి, ఇంకా ఆలస్యం చేస్తాడు. ఇంకా ఆలస్యం చేశావేమిటని అడగటం బుద్ధితక్కువ ఒకవేళ అడిగితే! 'ఏమిటయ్యా, నీ అథార్టీ. తింటే తిను, లేకపోతే బయటికి నడు' అంటాడు"

"మానేజిమెంట్ కూడా ఇంతేనా!"

"అది కొంచెం మెరుగే ననిపిస్తుంది కాని మన వూళ్లను చూస్తుంటే అనుమానంగానే ఉంటుంది. బెజవాడలాంటి ఊరును తీసుకోండి. ఏ కొద్దివాటిని మినహాయిస్తే, మిగిలిన హోటళ్లన్నీ నెల కొకసారి బోర్డు తిప్పుతూ ఉంటయ్ కదా"

"దక్షిణాదిపోటీలో మీరు నేర్చుకున్న [illegible]కులు ఏమయినా ఉన్నయ్యా!"

"ఎన్నో ఉన్నయ్. కాతాదార్లను [illegible]ం వాళ్లు నేర్పిన విద్యే. అంతవరకూ సరుకు బాగా ఉంటే చాలని అనుకునేవాళ్లు."

"ఎందుచేత?"

"తెలుగువాడి దృష్టి పెసరట్ల వెంకయ్య



గాడి పొయ్యిని దాటి పోదు. పొయ్యి పక్కన గొంతు కూర్చుని, చేతుల్లో ఆకులు పెట్టుకుని తినే మొగవాళ్ళూ, పిల్లలచేత ఇంటికి తెప్పించుకుని తినే ఆడవాళ్లూ కనిపిస్తారు- అందువల్ల సరుకు బాగా ఉంటే చాలనుకునేవాళ్లు."

"ఆ పరిస్థితి ఎందుకు మారిందంటారు ?"

"భారీఎత్తున సరుకును చేయాలంటే నాణెంగా ఉండటం కష్టం. ఎక్కువ లాభాలు కావాలంటే, ఇతర ఆకర్షణలు చూపించి సరుకును, భారీగా అమ్మాలి. తెలుగువాడి హోటలికి వెళ్ళి విరిగిపోయిన బెంచీలమీద కూర్చుని, చితచితలాడే బల్లలమీద, కడిగీ కడగని, ప్లేట్లతో పొగలో బాధపడే బదులు, కొంచం రుచి తక్కువయినా, అరవహోటలికి వెళ్లి తళతళలాడే బల్లలూ, గిర్రున తిరిగే ఫాన్‌లూ, మయసభామోస్తరు అద్దాలూ మధ్య కూర్చుని తినాలని ఎవడయినా అనుకుంటాడు. హోటల్ నడపటంలో నామర్దా ఏమీ లేదన్న విషయాన్ని కూడా వాళ్లు నేర్పారు."

"జనంఆర్థికపరిస్థితులు, అభిరుచులు తెలియటానికి మీకు ఎక్కువ అవకాశం ఉన్నదేమో ?"

"కొంతవరకూ ఉంది. 1930 వరకూ హోటలుకి వెళ్ళటమంటే పెద్ద వ్యసనమని పెద్దవాళ్లు భావించారు. కాని తరవాత అదే ఫాషన్ అయింది.

"1930 ప్రాంతపు డబ్బుకటకట దెబ్బ మీకేమయినా తగిలిందా ?"

"బాగానే తగిలింది. అప్పుడే హోటల్లో తిని డబ్బు ఎగెయ్యటం జనానికి అలవాటయింది. కుర్రకారు-అంటే అప్పటి కుర్రకారు - భాయ్, బ్రదర్ అంటూ ఎంతో చనవగా ఎదటివాడితో మాటకలిపి, బిల్లు వాడికి వదిలి జారుకునేవాళ్లంటే డబ్బుకటకట ఎంత తీవ్రంగా ఉండేదో ఆలోచించుకోండి. అప్పటి కుర్రకారుని ఇప్పటికైనా నేను గుర్తుపడతానంటే, వాళ్లమీద ఆ దెబ్బ ఎంత గట్టిగా అచ్చుగుద్దుకుపోయిందో తెలుస్తుంది."

"1935 తరవాత ?"

"1937 లో ఎన్నికలు వచ్చినయ్. అప్పుడు రెండు నెలలపాటు హోటళ్లు డబ్బును మహా దోచినయ్. ఇంతలో యుద్ధం వచ్చి మా పంటపండింది."

"ఎందువల్ల ?"

"ఉద్యోగాలు లేని జనం యుద్ధంలో చేరారు. ఒకచోటి జనం మరొక చోటికి ఫిరాయింపు జరిగి హోటళ్లమీద ఆధారపడ్డారు."

"మీకు పంచదార, సెనగపిండి ఎట్లా దొరికేవండీ ?"

"నగరాల్లోఅయితే పెద్ద అధికారులు సాయపడేవాళ్లు. చిన్న పట్నాల్లో అయితే చుట్టుపక్కల ఉన్న పల్లెటూళ్ల నాయకులు తోడుపడేవాళ్లు."

"ఏవిధంగా ?"

"గ్రామాల్లో మోతుబర్లుంటారు చూశారూ, గ్రామకాంగ్రెస్ దగ్గర నుంచి కోఆపరేటివ్ సొసైటీలవరకూ వాళ్ల చేతుల్లోనే ఉంటయ్. వాళ్లు బస్తీలకు వచ్చి, తమ గ్రామపు రేషన్‌ని మాకు ఇచ్చి, నోట్లు జేబులో పెట్టుకుని పోయేవాళ్లు. వాళ్ల దెబ్బకి ఎదురులేదుగా !"

"కాఫీహోటళ్లు పల్లెల్లో వ్యాపించి, జనం వొళ్లొంచి పనిచేయకుండా తయారైనారండీ."

"ఇందులో మా తప్పేమీ లేదు. ఈ విషయమై కొంతమందిని అడగ్గా వాళ్ళిచ్చిన జవాబును వినండి. 'ఎవరికోసం పోయి రెక్కలు విరుచుకుంటాం ? పొలం దున్నేవాళ్లకే భూములని మీటింగుల్లో అరుస్తారే కాని ఎవ్వరూ అమలుజరపరు. మా వీలునుపట్టి పని చేస్తాంలే' అన్నారు."

"ప్రభుత్వంమీద శానిటరీ, కంట్రోలు వ్యవహారాలే కాక ఇంకా ఫిర్యాదు లున్నయ్యా ?"

పెద్ద ఫిర్యాదు ఒకటున్నది. ఎన్నికలు సరిగా జరపకపోవటంవల్ల, వాటి ప్రచారంలో మాకు వచ్చే డబ్బు పోయింది."

"మీకు మేలు చేసిం దెవరు ?"

"విద్యాశాఖవాళ్లు. స్కూల్ ఫైనల్ పరీక్షలకు కూడా సెప్టెంబర్ ఛాన్స్ ఇచ్చారు. పరీక్షచదువులంటే హోటళ్లకి ఎంత గిరాకో తెలుసుగా ?"

"మీ పరిశ్రమవల్ల దేశానికి నిజమైన మేలు ఏమయినా ఉన్నదా ?"

"ప్రాంతీయద్వేషాలు నశించిపోతయ్. వుడిపివాళ్లూ, గుజరాతీలు మానేజ్ చేయగా, అరవలు పనిచేస్తుండగా, ఆంధ్ర ప్రజానీకం కుల, మత, లింగవివక్షత లేకుండా బొంబాయి హల్వా, బెంగాలీ రసగుల్లా, యు. పి. బాదా, మార్వాడీ జిలేబీ, అమెరికన్ ఐస్‌క్రీం సేవిస్తారు. ఇంతకన్నా కావలసిం దేమిటి ?"

"ఒక్కటి ఉన్నది. పెద్ద హోటల్ పెట్టేది ఎట్లా ?"

"పొలం, పుట్రా ఉంటే అమ్మి డబ్బుతీసుకురాండి. దగ్గరుండి చేసుకునే వాడికి తప్ప పొలం గిట్టుబాటు కాదు. ఆ డబ్బుతో పెద్ద పట్నంలో ఏ కాలేజీఎదురుగానో, స్టయిల్‌లో హోటల్ పెట్టండి. ఆడసర్వర్లు మరీ మంచిది. ప్రారంభోత్సవాన్ని ఒక మంత్రిగారిచేత జరిపించండి. వాటాదార్లుగా మంత్రులనో, ఎం. ఎల్.ఏ.లనో, వాళ్ల చుట్టాలనో తీసుకుంటే పరమ శుభం...మాకు మీటింగ్ వేళ అవుతున్నది." అంటూ ఆయన లేచాడు.